క్లుప్తంగా

ప్రత్యేక తరగతుల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో అరుణశ్రీ

మాకవరపాలెం: ఇంటర్ పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులను ఎంపీడీవో అరుణశ్రీ పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులను శనివారం ఆమె తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ సుందరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా

రావికమతం: బుద్ధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తకోట హైస్కూల్‌లో సోమవారం నుంచి ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్టు యోగా గురు నక్క రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి ఉచిత శిబిరంలో భాగంగా నిర్వహించే తరగతులకు అన్ని వయసుల వారు హాజరు కావచ్చని, ఆరోగ్యానికి అవసరమైన సునాయాస పద్ధతులలో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

కొత్తకోటలో వేసవి విజ్ఞాన శిబిరం

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 16వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్టు గ్రంథపాలకురాలు వరహామణి శనివారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, యోగా వంటి సృజనాత్మక కార్యక్రమాలపై రోజూ తర్ఫీదు ఇస్తామన్నారు.

సంఘటితంగా కార్మికుల హక్కుల సాధన



రాజాంలో కూలీలతో సీఎఫ్‌టీయూఐ నాయకులు

బుచ్చెయ్యపేట: కార్మికులు హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉండి తమ డిమాండ్లను పరిష్కరించుకోవాలని సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు ఎస్. కనకారావు కోరారు. శనివారం రాజాం గ్రామంలో ఉపాధి కూలీలను కలుసుకుని మే డే ద్వారా సాధించిన హక్కులను కార్మికులు కాపాడుకోవాలన్నారు. ఉపాధి కూలీ పనుల తీరు, పనులు వద్ద కల్పిస్తున్న వసతులు, అందుతున్న వేతనాలుపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కె. ప్రకాష్, మాజీ సర్పంచ్ నాగులాపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మరిసా సతీష్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పందేలు నేడు



కొత్తూరు రామాలయం

దేవరాపల్లి: బోయిలకింతాడ పంచాయతీ శివారు కొత్తూరులో కోదండరామ స్వామి సహిత సీతారాముల ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మహోత్సవానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు హాజరవుతారన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పందేలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున బహుమతులను అందజేస్తామన్నారు.

ఘనంగా ఈశ్వరాంబ జయంతి

కశింకోట: కోమటి వీధి ఆలయంలో సత్యసాయిబాబా మాతృమూర్తి ఈశ్వరాంబ జయంతి శనివారం నిర్వహించారు. బాల వికాస్ బాలబాలికలతో తల్లిదండ్రులకు పాద పూజ చేయించారు.

ప్రభుత్వ విద్యార్థుల హవా

- పది ఫలితాల్లో బాలికలదే పైచేయి..
- ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ఫలితాలు

నర్సీపట్నం: పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ప్రభుత్వం శనివారం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నర్సీపట్నం మండలం 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో సాయిశైలజ తెలిపారు. ఈ ఏడాది పరీక్షలకు 1,944 మంది విద్యార్థులు హాజరు కాగా, 1,521 మంది ఉత్తీర్ణులయ్యారు. శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన ఎల్.హేమంత్ కుమార్, నారాయణ స్కూల్‌కు చెందిన వై.సాయి తేజ అత్యధిక మార్కులు సాధించారు.

గురుకులం...

స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే బి.సి. గురుకుల పాఠశాలలో 34 మంది విద్యార్థులకుగాను 33 మంది ఉత్తీర్ణులయ్యారు. 17 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి తెలిపారు. వేములపూడి ఏపీ మోడల్ స్కూల్ నుంచి 96 మందికిగాను 93 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. పి.లలిత శ్రీశ్రీ, వి.తులసి అత్యధిక మార్కులు సాధించారన్నారు.

చోడవరంలో 78.3 శాతం ఉత్తీర్ణత

చోడవరం రూరల్: మండంలోని ప్రభుత్వ, జడ్పీ, గురుకుల, కేజీబీవీ నుంచి 753 మంది విద్యార్థులకుగాను 590 మంది ఉత్తీర్ణులయ్యారు. 78.3 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఆయా పాఠశాలల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 60.8 శాతం ఉత్తీర్ణతతో 92 మందికి 56 మంది, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 77 శాతంతో 30 మందికి 23 మంది ఉత్తీర్ణత సాధించారు. లక్ష్మీపురం ఉన్నత పాఠశాల నుంచి 115 మంది పరీక్షలకు హాజరు కాగా 83.47 శాతంతో 96 మంది ఉత్తీర్ణులయ్యారు. పి.ఎస్.పేట పాఠశాల నుంచి 56 మందికి గాను 81 శాతంతో 43 మంది, జన్నవరం పాఠశాల నుంచి 45 మందికి 37 మంది ఉత్తీర్ణతతో 82 శాతం నమోదైంది. గోవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 97 మందికి 79 మంది ఉత్తీర్ణతతో 81.4 శాతం నమోదైంది. జుత్తాడ నుంచి 40 మందికిగాను 36 మంది ఉత్తీర్ణతతో 90 శాతం, లక్కవరం నుంచి 62 మందికి 48 మంది ఉత్తీర్ణతతో 77.4 శాతం ఫలితాలు వచ్చాయి. గవరవరం నుంచి 41 మందికి 31 మంది ఉత్తీర్ణతతో 78 శాతం, దుద్దుపాలెం నుంచి 26 మందికి 18 మంది ఉత్తీర్ణతతో 70 శాతం, ముద్దుర్తి నుంచి 43 మందికి 38 మంది ఉత్తీర్ణతతో 88.3 శాతం, గౌరీపట్నం నుంచి 29 మందికి 22 మంది ఉత్తీర్ణతతో 75.8 శాతం, బీసీ బాలికల గురుకుల పాఠశాల నుంచి 36 మందికి 30 మంది ఉత్తీర్ణతతో 83.33 శాతం నమోదైంది. కేజీబీవీ నుంచి 41 మందికి 33 మంది ఉత్తీర్ణతతో 80.4 శాతం నమోదయ్యింది. గౌరీపట్నం పాఠశాలలో 500 లోవ పాఠశాల ఫస్ట్ కాగా, మిగిలిన అన్ని పాఠశాలల్లోనూ 513 మార్కుల పైబడి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు.

కె.కోటపాడు: ఎ.కోడూరు హైస్కూల్‌లో 100 మందికిగాను 92 మంది, పాతవలస హైస్కూల్‌లో 50 మందికిగాను 49 మంది, కొరువాడ హైస్కూల్‌లో 36 మందికి 35, కె.కోటపాడు హైస్కూల్‌లో 99 మందికి 91 మంది, చౌడువాడ హైస్కూల్‌లో 120 మందికి 112 మంది, కేజీబీవీలో 39 మందికి 37 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎ.కోడూరు హైస్కూల్‌లో 74 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు అయ్యారు. వీరిని ఎంఈవో మధుమూర్తి, హెచ్ఎం అనురాధ అభినందించారు.

మాకవరపాలెం: మండలంలో ఐదు ఉన్నత, కేజీబీవీ పాఠశాలల నుంచి 571 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 369 మంది ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో నరేష్ శనివారం తెలిపారు. వీరిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

నాతవరం: మండలంలో నాతవరం, గునుపూడి, డి.యర్రవరం, చమ్మచింత, తాండవ, మన్యపురట్ల, ఎం.బి.పట్నం హైస్కూళ్ల నుంచి 558 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో 324 మంది ఉత్తీర్ణత సాధించారు. నాతవరం హైస్కూల్‌లో 550 పైగా ముగ్గురు, 500 పైబడి 12 మందికి మార్కులు వచ్చాయి. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా అధిక శాతం మార్కులు రావడంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– మాడుగుల మండలంలో 70 శాతం ఉత్తీర్ణత

మాడుగుల: మండలంలో పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 728 మందికిగాను 511 మంది ఉత్తీర్ణత



విద్యార్థి మౌళికి మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

సాధించారు. మొత్తంగా 70 శాతం ఫలితాలు వచ్చినట్టు ఎంఈవో బి. దేముడమ్మ తెలిపారు. ఉత్తీర్ణత పొందిన వారిలో 306 మంది బాలికలు ఉన్నారన్నారు. వీరిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

చీడికాడ: మండలంలో 491 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో బి. గంగరాజు తెలిపారు. మండలంలో పది పాఠశాలల నుంచి 549 మంది పరీక్షలకు హాజరు కాగా, 491 మంది పాసైనట్లు పేర్కొన్నారు. ఖండివరం ఉన్నత పాఠశాల నుంచి 45 మందికి 25 మంది, కోనాం గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల నుంచి 7 గురు, కోనాం అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల నుంచి 80 మందికి 66 మంది పాసైనట్లు తెలిపారు.

రావికమతం: మండలంలో 11 ప్రభుత్వ హైస్కూల్‌లో 780 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 531 మంది పాసై 65.7 శాతం ఫలితాలను సాధించారు. మరుపాక మోడల్ స్కూల్‌లో 96 మందికి 92 మంది పాసై 96 శాతం అత్యధిక శాతం నమోదైంది. చినపాచిలలో 51 మందికి 25 మంది పాసై అత్యల్పంగా 49 శాతం ఫలితాలను సాధించారు. వీరిని తల్లిదండ్రులతోపాటు హెచ్ఎంలు, విద్యా కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

రోలుగుంట: మండలం నుంచి కేజీబీవీతో కలపి తొమ్మిది పాఠశాలల నుంచి 426 మంది పరీక్షలకు హాజరు కాగా 283 మంది ఉత్తీర్ణతతో 66 శాతం ఫలితాలు సాధించారని ఎంఈవో సాయి శైలజ తెలిపారు. బి.బి.పట్నం నుంచి 21 మందికి 15 మంది, బుచ్చింపేట నుంచి 76 మందికి 45 మంది, కొంతలం నుంచి 23 మందికి 15 మంది, జె.నాయుడుపాలెం నుంచి 63 మందికి 39 మంది, కొవ్వూరు నుంచి 18 మందికి 12 మంది, కొమరవోలు నుంచి 29 మందికి 20 మంది, కుసుర్లపూడి నుంచి 58 మందికి 42 మంది, రోలుగుంట నుంచి 100 మందికి 65 మంది, కేజీబీవీ నుంచి 38 మందికి 29 మంది ఉత్తీర్ణత సాధించారు.

దేవరాపల్లి మండలంలో 96శాతం ఉత్తీర్ణత

దేవరాపల్లి: మండలంలోని 11 ప్రభుత్వ, 2 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 426 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 411 మంది ఉత్తీర్ణతతో మొత్తంగా 96 శాతం ఫలితాలు నమోదు చేశారని ఎంఈవో సిహెచ్.రవీంద్రబాబు తెలిపారు. వేచలం హైస్కూల్ విద్యార్థి రెడ్డి మౌళి అత్యధిక మార్కులు సాధించాడు.

మాడుగుల రూరల్: కె.జె.పురం జెడ్పీ హైస్కూలు విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల నుంచి 38 మందికిగాను 37 మంది పాసైనట్లు హెచ్ఎం వి. దాసు తెలిపారు. వీరిని స్కూలు కమిటీ చైర్మన్ మళ్ల కిశోర్ అభినందించారు. జి. అగ్రహారం జెడ్పీ హైస్కూలు నుంచి 26 మందికి 23 మంది పాసయ్యారు. వీరనారాయణం పాఠశాల నుంచి 68 మందికి 61 మంది పాసైనట్లు హెచ్ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు.

బుచ్చెయ్యపేటలో 67 శాతం ఉత్తీర్ణత

బుచ్చెయ్యపేట: మండలంలో 692 మంది విద్యార్థులకు గాను 464 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 67 శాతం ఫలితాలు వచ్చాయి. పెదమదీన హైస్కూల్‌లో 15 మందికి 13 మంది ఉత్తీర్ణతతో 86 శాతం, వడ్డాది కేజీబీవీలో 40 మందికి 32 మంది ఉత్తీర్ణతతో 82 శాతం, సీతయ్యపేటలో 104 మందికి 80 మంది ఉత్తీర్ణతతో 81 శాతం, రాజాంలో 67 మందికి 49 మంది ఉత్తీర్ణతతో 73 శాతం, తురకలపూడిలో 33 మందికి 24 మంది ఉత్తీర్ణతతో 72 శాతం, గున్నెంపూడిలో 33 మందికి 23 మంది ఉత్తీర్ణతతో 70 శాతం, విజయరామరాజుపేటలో 78 మందికి 51 మంది ఉత్తీర్ణతతో 65 శాతం, దిబ్బిడిలో 134 మందికి 82 మంది ఉత్తీర్ణతతో 61 శాతం, వడ్డాదిలో 188 మందికి 110 మంది ఉత్తీర్ణతతో 59 శాతం ఫలితాలు సాధించారు.

నేడు ఎం. కోడూరులో మోదకొండమ్మ పండగ



ఎం. కోడూరు మోదకొండమ్మ అమ్మవారు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. అమ్మవారికి బంగారు, వెండి ఆభరణాలు, పట్టు వస్త్రాలు, అలంకరించనున్నారు. ఈ జాతరకు ప్రత్యేక ఆహ్వానితులుగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి హాజరవుతారన్నారు. రేలా రే రేలా, బాలు రైడర్స్ గాజువాక, బుర్రకథ, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

కె.కోటపాడు: పిల్లలకు తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని కె.కోటపాడు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు తెలిపారు. స్థానిక రామాలయంలో శనివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాలవికాస్ విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు పాదపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈశ్వరాంబా దినాన్ని బాల వికాస్ దినంగా నిర్వహించి పాదపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్షేమ రారాజు సీఎం జగన్

- కలిగొట్లలో అత్యవసర పనులకు రూ. 20 లక్షల మంజూరు
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ఎంపీపీ స్కూల్‌లో నాడు-నేడు పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కలిగొట్లలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: సంక్షేమ పథకాలు అమలులో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శనివారం కలిగొట్లలో ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా మహానేత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఎంపీపీ పాఠశాలలో నాడు-నేడు స్కీమ్‌లో రూ. 23.44 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను, రూ. 11.25 లక్షలతో చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనులను ఆయన శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడి విద్యాభివృద్ధికి సీఎం ఏయే పథకాలను అందిస్తున్నారని ఆరా తీశారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కలిగొట్ల గ్రామ సచివాలయం పరిధిలో 3,315 మంది లబ్ధిదారులకు రూ. 9.95 కోట్లు మేర సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వం అందజేసిందన్నారు. కలిగొట్ల, శివారు గ్రామాలకు జలజీవన్ మిషన్ నుంచి రూ.1.50 కోట్ల నూతన ట్యాంక్‌ల నిర్మాణంతోపాటు ప్రతీ ఇంటికి కుళాయి త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. రూ. 3.50 కోట్లతో ప్రభుత్వ భవనాలతోపాటు సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు సీసీ డ్రైనేజీలు నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. 83 మందికి జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలను కేటాయించి సొంతింటి కల నెరవేర్చామన్నారు. కాశీపురం-బోయిలకింతాడ రోడ్డు విస్తరణ అనంతరం కలిగొట్ల మీదుగా బస్సు సదుపాయం ఏర్పాటుకు కృషి చేస్తానని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. గ్రామంలో అత్యవసర పనులు నిమిత్తం రూ. 20 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఎంఈవో సిహెచ్. రవీంద్రబాబు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్ గొంద్రపోటు సుధారాణి, ఎంపీటీసీ రుత్తల లక్ష్మీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి చింతు రాము, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, తిమిరాం సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ, ఎం. అలమండ పీఏసీఎస్ అధ్యక్షుడు బండారు ప్రసాదరావు, ఎంపీటీసీ పోతల వెంకటరావు, మాజీ ఎంపీటీసీ గూనూరు కొండబాబు, గొంద్రపోటు పార్థసారథి, రుత్తల రాంబాబు పాల్గొన్నారు.

వివాదాస్పద భూములపై పూర్తిస్థాయి పరిశీలన

అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ ఆదేశం



గౌరీపట్నం భూ వివాదంపై ఆర్డీవోకు వివరిస్తున్న ఫిర్యాదుదారులు, నాయకులు

చోడవరం: వివాదాస్పద భూములుపై స్థానిక రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేసిన తర్వాతే రికార్డులు నమోదు చేయాలని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ ఆదేశించారు. గౌరీపట్నంలో రెండు వర్గాల మధ్య వివాదాస్పదంగా ఉన్న భూమి నమోదుపై వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఆర్డీవోను కలిసి చోడవరం రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు చేశారు. గౌరీపట్నం రెవెన్యూ పరిధిలో కోన కన్నాపాత్రుడుకు చెందిన భూమిని తోట వెంకటసత్యవతికి చెందినట్లుగా ఆన్‌లైన్లో తప్పుడుగా నమోదు చేశారని సీపీఎం నాయకులు ఎస్.వి. నాయుడు, దేముడునాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ ఆరోపించారు. ఈ రికార్డులపై పూర్తిస్థాయిలో సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సదరు ఫిర్యాదుపై చర్యలు తీసుకుని విచారణ చేస్తామన్నారు. పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి పరిశీలన చేసిన తర్వాతే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ తిరుమలరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పోతురాజు స్వామి పండుగ నేడు

దేవరాపల్లి: తామరబ్బలో పోతురాజు స్వామి పెద్ద పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు.

కేపీ అగ్రహారాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విప్ ధర్మశ్రీ



కేపీఅగ్రహారంలో సమస్యలు వింటున్న విప్ ధర్మశ్రీ



సచివాలయం దారిలో కాలువ నిర్మించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: కేపీ అగ్రహారంలో సమస్యలు లేకుండా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మండల అధికారులతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సంక్రమంగా అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలన ఎలా ఉంది, అంతా సుఖంగా ఉంటున్నారా లేదా అని వివరాలు అడిగారు. టీడీపీ పాలన కన్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన విధానం, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరు బాగుందని ప్రజలు విప్ ధర్మశ్రీకి వివరించారు. అవినీతికి తావు లేకుండా నేరుగా సంక్షేమ పథకాల నగదు తమ బ్యాంక్ ఖాతాల్లో జమ చేయం వల్ల లబ్ధి పొందుతున్నామని ఆనందం వ్యక్తం చేశారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. సాంకేతిక లోపాలు వల్ల ఆగిపోయిన అర్హులకు పథకాలు అందించాలని విప్ ధర్మశ్రీ ఎంపీడీవో సువర్ణరాజు, జేఈలు హరీష్, ప్రభులకు సూచించారు. గ్రామస్తులు వినతుల మేరకు గ్రామంలో బస్టాప్‌తో పాటు, సచివాలయానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా సిమెంట్ కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీని గ్రామ నాయకులు, మహిళలు, రైతు సంఘ నాయకులు సత్కరించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దేవర అప్పారావు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, ఉప సర్పంచ్ ముసలినాయుడు, గ్రామ సచివాలయ కన్వీనర్ గోపిశెట్టి రమణ, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ గోపిశెట్టి నూకరాజు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి



వారాడలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో శచీదేవి

కె.కోటపాడు: సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహన్ని అందిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. హౌసింగ్ డే సందర్భంగా కె.సంతపాలెం, వారాడ గ్రామాల్లో లబ్ధిదారులతో ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. వారాడలో సొంత స్థలాలు కలిగిన 52 మందికి ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్లు ప్రత్యేకాధికారి తెలిపారు. వేగవంతంగా నిర్మాణాన్ని పూర్తి చేసుకుంటే, దశలవారీగా బిల్లులు చెల్లిస్తామని వివరించారు. ఎంపీడీవో శచీదేవి, హౌసింగ్ ఏఈ బి.రవిబాబు, సర్పంచ్ గొంద్రపోటు సౌజన్య, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టరు



సాగరంలో గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రీలక్ష్మి

మాడుగుల రూరల్: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా సాగరంలో 80 మంది రోగులను శనివారం కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీలక్ష్మి పరీక్షించారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నార్లను పరీక్షించారు. ఆరోగ్య పర్యవేక్షకుడు జి. ప్రసాద్, ఏఎస్ఎం కొండమ్మ, ఆరోగ్య సహాయకులు కె. నాగేశ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడు: వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా శనివారం దాలివలస 169 మందిని పరీక్షించి ఉచితంగా మందులను ఇచ్చారు. ఇళ్ల వద్దకు వెళ్లి ఎనిమిది మందికి వైద్యం అందించారు. ఎంపీహెచ్ఈవో కె.వి.రాజశేఖర్, ఏఎస్ఎం పాల్గొన్నారు.



దాలివలసలో వైద్యం అందిస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

నాతవరం: ఉపాధి పనులు చేస్తుండగా గుండెపోటు రావడంతో ఓ కూలీ మృతి చెందాడు. మండలంలో మర్రిపాలెం గ్రామానికి చెందిన బొత్సా సత్తిబాబు(49) శనివారం తోటి కూలీలతో కలిసి ఉపాధి హామీ పనికి వెళ్లాడు. పనిచేస్తుండగా ఛాతీలో నొప్పి వస్తోందంటూ సత్తిబాబు కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు సపర్యలు చేసి వైద్యం కోసం ఇంటికి తీసుకువచ్చారు. స్థానికంగా ఉన్న వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, వీఆర్వో అప్పారావులకు వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మంకు సాంబమూర్తి సమాచారం అందజేశారు. సత్తిబాబు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు భోరున విలపించారు.